# 13. ఎవర్ గ్రీన్ హీరో - దేవుడు

ఈ పుణ్యభూమిలో ఎందరెదరు మహానాయకులుపుట్టి, ఎన్నెన్ని అధికార పీటలెక్కి, ఎందరెందరు అమాయక ప్రజల చేత ఎంతెంతగా పూజలు చేయించుకున్నా ఎన్ని శిలా విగ్ర హాలు పాతించుకున్నా, నాటికీ, నేటికీ మన పర్మనెంట్ హీరో దేవుడే.

సదరు ఎవర్ గ్రీన్ హీరో ముందు అనేకానేక రాజకీయ తంత్రములందు,యుద్ధములందు టోపీలు వేయుటయందు ఆరితేరిన మహానుభావులు సైతం టెంపరరీ హీరోలేనని, అందునా సైడుహీరోలు మాత్రమేననీ మరోసారిరుజువయింది.

దేవుడంటూ ఒకడున్నా డనేది మరచిపోయి తామే దేవుళ్ళలా ఫోజులు పెడుతూ ప్రజలచేత పూజలూ, భజనలూ చేయించుకో జూచే నయా దేవుళ్ళమధ్య ఎక్కువయి పోయారు. దెయ్యాలుకూడా సోషలిస్టు మంత్రాలు పఠిస్తూ దేవుళ్ళలా మేకప్ చేసుకుని దేశంమీదపడి బ్రతక జూడటం ఈ యుగ లక్షణంలా వుంది.

లాండ్ సీలింగులనీ, అదనీ, ఇదనీ అదరగొట్టేసి ప్రజల చేత హారతులు పట్టించుకోబోయిన రాజకీయవేత్తల్ని నెల

తిరగకుండానే తెర వెనక్కి తోసేసి, ఇంతింతై వటుడింతింతై అన్నట్టుగా వార్తల్ని అన్నింటినీ ఆక్రమించేశాడు దేవుడు.

ఫలితంగా ప్రస్తుతం మన అపర దేవుళ్ళంతా సీలింగ్ సింహగర్జనల్ని పెండింగు ఫైళ్ళలో దాచేసి అసలు దేవుడి ముందు సాష్టాంగాలు పడి "కావవే వరదా! కరుణింపవే వర్షం" అంటూ గుంజీలు తీస్తూండటం దైవభక్తులెల్లరూ హర్షించదగిన పరిణామం.

దేశంలోని పెత్తందార్లలో ప్రధాని ఫస్టా లేక రాష్ట్రపతా? అని ఆ మధ్య కొందరు రాజ్యాంగ నిపుణులు చర్చోపచర్చలు సాగించారు ఆ తిలకాష్ఠ మహిషబంధం ఒక పట్టాన తెగలేదు గానీ మొత్తంమీద ఆ ఇద్దర్నీ మించిన పెత్తందారు దేవుడేనని మాత్రం ప్రస్తుతం రుజువయిపోయింది.

ఈ అద్భుత సత్యాన్ని అనుభవ పూర్వకంగా గ్రహించి ధన్యులై ఘనమైన ఏలినవారు ఈనాడు మన రాష్ట్రంలోని అనావృష్టికీ, రానున్న కరువుకు కారకుడు సదరు సర్వాంతర్యామియే కారకుడని తేల్చిపారేశారు. అందు కనుగుణంగా కొన్ని చరిత్రాత్మక, శాస్త్రీయ, వేదవిహిత నిర్ణయాలు కూడా చేసేశారు.

వర్షాలకోసం దేవుడికి స్పెషల్ విజ్ఞప్తులూ, ప్రార్థనలు, నైవేద్యాలు చేయించండని దేవాలయాలకు తాఖీదులు వెళ్ళాయట. దేవాలయాల్ని జాతీయం చేసి ప్రభుత్వ పెత్తనం

క్రిందికి తేవటం వల్ల మంత్రులకు పట్టుచీరలూ, పంచలూ బహుమతులుగా దొరకటం వినా మరేం జరగటం లేదనే విమర్శకులు ఈ సత్యాన్ని గుర్తించాలి. దేవుడినీ దేవాలయాల్నీ ప్రజాసేవకై ఎలా వాడుకోవాలో పాలకులకు బాగానే తెలుసు.

అలాగే వర్షాలకోసం భజనలూ, క్రతువులూ, యజ్ఞాలూ గట్రాచేసే లేదా చేయదలచిన ప్రైవేటు భజన సంఘాలకు స్పెషల్‌గా ఆర్థిక సహాయంచేసే స్కీం ఒకటి ఆలోచనలో ఉందటకూడా.

జేబుకోక సాహిత్య భజన సంఘాన్ని స్థాపించుకుని యథావిధిగా సాహిత్య సేవ ఉదర పోషణ చేసుకుంటున్న దేశ భక్త కవుల కిదొక సదవకాశం. గ్రాంట్లు తెచ్చుకుని గవర్నమెంటు డబ్బుతో దేవుడికి పెళ్ళిళ్ళూ, వరుణదేవుడికి పునస్సంధానాలూ చేయించి అటు పుణ్యం, యిటు నాలుగు డబ్బులూ కూడా వెనకేసుకోవచ్చు.

"గ్రీన్ రివల్యూషన్ తెచ్చాం. అది చేశాం. ఇది చేస్తాం! దేశం భయంకరంగా బాగుపడిపోతుంది. చూస్కోండి మా సోషలిస్టు తడాఖా!" అని నిత్యం గర్జించే నాయకులకు ఇదొక గుణపాఠం. దేశం బాగుపడ్డా, భంగపడ్డా అంతా వాడి లీలే. వీళ్ళందరూ నిమిత్త మాత్రులేనని దేవుడే స్వయంగా రంగంలోకి దిగి రుజువు చేస్తున్నాడు.

ఆ మధ్య ఓ ఆంగ్ల దిన పత్రికలో ఓ జ్యోతిష్యులవారి అడ్వర్టయిజు మెంటులో భాగంగా ఓ కేంద్ర మంత్రిగారి సర్టిఫికేట్ వచ్చింది “ఫలానా జ్యోతిషులవారు నాకు మంత్రించి దయ చేయించిన తాయెత్తు అద్భుతంగా పనిచేసింది. అమోఘమైన ఫలితాలిచ్చింది. సదరు తాయెత్తుల కంపెనీ వర్ధిల్లుగాక” అని దాని సారాంశం.

ఎంత నాస్తిక దుర్మార్గుడైనా ఈ సర్టిఫికేట్‌ను కాదన లేడు. సదరు తాయెత్తు కిసింజర్ మహాశయుని రాముబాణంలా పకడ్బందీగా పని చేసిందనేందుకు దాన్ని ధరించిన పెద్దమనిషి కేంద్రంలో మంత్రిగా ఉండటం కన్నా మరేం సాక్ష్యం కావాలి? మంత్రి అవటం-అందునా కేంద్రంలో అంటే మాటలా?

అయితే, అంత గొప్ప తాయెత్తుల కంపెనీ దేవుడికి మన మంత్రిగారి సర్టిఫికేట్‌తో ప్రచారం చేసుకోవాల్సిన ఖర్మేమిటని కొందరు అమాయకులకు అనుమానం కలుగవచ్చు అదొక దేవ రహస్యం ఎంతటి వాడికీ కొందరు హాంగు చార్లు ఉండక తప్పదు. ఊళ్ళు పంచేసుకోవటంలో తెలివైన వాళ్ళెప్పుడూ పట్టు విడుపులు ప్రదర్శిస్తూనే ఉంటారు. లేకుంటే ఇద్దరూ జాయింటుగా బజార్న పడటం తర్వాత జైలుకు వేంచేయటం ఖాయం. సింహానిదీ ఎప్పుడూ ముందు భోజనమే మిగిలిన బొమికిలే నక్కలవంతు తెలివైన నక్కలు సింహాల చేత బొమికలే నమిలించి అసలు అంతా తామే మింగేస్తా యనుకోండి. అది వేరేసంగతి.

అందుకే దేవుడికన్నా ముందు పూజారిని మంచి చేసు కోమన్నారు అనుభవజ్ఞులు, పూజారి దయలేకపోతే దేవుడు లేనట్టే లెక్క. ఇచ్చినా ఆ వరందక్కదు. పూజారుల్ని తోడు దొంగతోగానీ, సింహం ప్రక్క నక్కతో గానీ పోల్చటం ఘోరమైన అపచారం. దేవుడికన్నా వాళ్ళకే మహిమలు ఎక్కువ.

తమిళనాడులో ఓ సుప్రసిద్ధ దేవుడికి మాన్యంగా అరవై వేల ఎకరాలుండేవి. ఆమధ్య ఓ విచారణ కమిటీ వాళ్ళువెళ్ళి చూస్తే అందులో అతురాలా నలభై వేల ఎకరాలు భూనభోం తరాళాల్లో ఎక్కడా కనిపించలేదట. ఇదంతా పూజార్ల మాహాత్మ్యమేనని ఆ కమిటీ పెద్దలు తేల్చేశారు. ఈపూజార్ల మహాత్మ్యాల ముందు మన పెద్దలు చేసే గారడీలు ఓ లెక్క-లోవా!

మరి దేవుడు చూస్తూ ఏం చేస్తున్నా డంటారా! ఆయన గారికి అల్పవిషయాలు పట్టించుకునే తీరికెక్కడ! అల వైకుంఠ పురిలో నగరిలో నా మూల అమ్మవారితో మూడు ముక్క లాటో ఏదో ఆడుకుంటూనో, లేక రేడియోలో క్రికెట్ కామెంటరీ వింటూనో కాలక్షేపం చేస్తుంటారు. మనం బుద్ధి తెచ్చుకుని భజనలు మొదలెడితే అప్పుడు తీరికగా శంఖచక్ర గదాదులు ధరించి గోచీబిగించి రంగంలోకి దిగాల్సిందే. ఈదేవ రహస్యం తెలుసు గనుకనే మన నాయకులు ఎన్ని సెక్యు లర్ కబుర్లూ, సోషలిస్టు జపాలూ వల్లించినా శంఖు స్థాప

నలూ, ప్రారంభోత్సవాలూ అన్నీ వేదోక్తంగానే జరిపేస్తారు. చెప్పే ప్రతిదీ ఆచరించి తీరాలని యెక్కడుంది. చెప్పండి. అదీగాక తర్వాత్తర్వాత ఆ శంఖుస్థాపన రాళ్ళు పాతినచోట రాళ్ళు తప్ప మరేం కనపడకపోతే అంతా ఆ దేవుడి మీదే తోసిపారేయవచ్చు.

వసిష్ఠుల వారంతటి పుణ్యపురుషులు పెట్టిన రాముల వారి పట్టాభిషేక ముహూర్తమే సాడ్‌సాంగ్‌తో పూర్తయి నపుడు మా ముహూర్తాలు, శంఖుస్థాపనలూ ఓ లెక్కలోవా అని దబాయించగలరు.

ప్రతి దానికీ ఏదో ఒక దొడ్డిదారి తెరిచి ఉండటం మన పవిత్ర భారతీయ వేదాంతాల ప్రత్యేకత. జ్యోతిష్యానికి పార్వతీదేవి శాపంకూడా ఈ బాపతే. ఈ కిటుకు బాగా తెలుసు గనుకనే దేవుళ్ళకన్న పూజార్లే హాయిగా బ్రతుకుతున్నారు. వీళ్ళ అవసరం సోషలిస్టు సమాజానికి ఎంత అవసరమో మనం గ్రహించాం గనుకనే సాంస్కృత కళాశాలలూ, యూని వర్సిటీలూ వేసి పారేసిస్తున్నాం అర్జంటుగా.

దేవుడు దయామయుడంటారు నిజమే. పూజార్లు బండగా మొండిగా వసూళ్ళుచేసి హుండీలు నింపుతూంటే దయగా ఉండకేం చేస్తారు. ఆ మధ్య ఓ దైవద్రోహి పూజార్ల నుద్దేశించి "వీళ్ళు పండాలుకాదు ప్రభో! పిండారీలు" అని వాపోయాడు. తప్పు! తప్పు! వాళ్ళను అలా నిందించకూడదు

వాళ్ళు కేవలం దేవుడి ఏజంట్లు. మనకేమన్నా ఇబ్బందంటూ ఉంటే డైరెక్టుగా దేవుడికి అప్పీల్ చేసుకోవాల్సిందే!

అందుకనే కరువులొచ్చినా కాటకాలొచ్చినా మన అధికారులు గోళ్ళూడగొట్టీ, గోచీలు వేలాంవేసో అయినా సరే పన్నులు మాత్రం వసూలు చేసేస్తారు. పూజార్ల కన్నా స్ట్రిక్టుగా-అప్పుడు జనం గజేంద్రుడిలా అయ్యవారికి మొరపెట్టుకోవాలి. ''కావరా మంత్రీ! కరుణించుబోను! అనుగ్రహించు శిస్తురెమిషన్'' అంటూ రాజదానీ నగరంబులో నావైపు ఏర్‌కండిషన్డు భవనంలో గల మంత్రి గారికి అప్పీల్ చేసుకోవాలి.

అప్పుడు దిగుతారు మంత్రులు.

''ఏమిటీ'' వర్షాల్లేవా! వర్షాలు లేకుంటే మాత్రం పంటలెందుకు పండవు? ఇంత ఘోరం జరుగుతూంటే దేవుడేం చేస్తున్నట్లు! సరేమేం దేవుడికి రాయబారం పంపుతాం.మీ కొంపలు వేలాం వేయకపోతే దేవుడికి పూజలు చేయించటానికి ఖర్చులెలా? యజ్ఞాల్లోకి నెయ్యికావద్దా!'' అన్నట్లుగా మాట్లాడేసి అంతకుముందు అధికార్లు వసూలుచేసిన అయిదు కోట్లశిస్తులో అరలక్ష ఉదారంగా విరాళం ప్రకటించి దయచేస్తారు.ఆతర్వాత బాధ్యత అంతా ఆ దేవుడిదే.

అంతా విని మా అప్పారావు గాడు అంటాడు గదా :
''అయితే గురూ? ఈ మధ్య తిరుపతిలో ఓ బ్రహ్మాండమైన

యజ్ఞం జరిపించారు గదా ; వందలాది డబ్బాల నెయ్యీ, బస్తాల బియ్యం, లారీల కట్టెలూ, లక్షలాది రూపాయలూ దేవుడికి హోమం చేశారు గదా! మన మహానాయకులంతా వెళ్ళి లెంప లేసుకుని, గుంజీలు తీసి గుండు కొట్టించుకుని మరీ వచ్చారు గదా? మరి ఈఉపద్రవా లేమిటి? యజ్ఞఫలం ఎక్కడ?'' అని.

"నాయనా! అప్పారావూ! నీ వింకా అమాయకుడవు! ఇవన్నీ దేవ రహస్యాలు: యజ్ఞఫలం ఎక్కడికిపోదు, మన దొడ్లోనో ఏ చింత చెట్టు మీదో కాపురం పెట్టే వుంటుంది. పార్వతీదేవి శాపం ఉందిగదరా నాయనా! అది శమించగానే తపీమని వర్షాలు పడి తీరుతాయి. అందాకా నీవు బ్రతికే ఉంటావులే! భయంలేదు! యజ్ఞఫలం అనుభవించి ధన్యుడవవు దువుగాని!'' అన్నాన్నేను.

"మీ సమర్థన అమోఘం సార్! మీరు నిజంగాపూజారి కాదగ్గవారు!'' అన్నాడు వాడు!

ఎంతైనా నా శిష్యుడే గదండీ.

(అక్టోబరు 1972)